# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 09-06-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. ప్రధానమంత్రిగా ఈ రోజు మూడవసారి బాధ్యతలు స్వీకరించనున్న నరేంద్రమోదీ ఈ ఉదయం జాతిపిత మహాత్మా గాంధీకి, మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయీకి నివాళులు అర్పించారు.**

**2. శ్రీకాకుళం పార్లమెంట్ సభ్యులు కె.రామ్మోహన్‌నాయుడికి కేంద్ర మంత్రి పదవి.. గుంటూరు పార్లమెంట్ సభ్యులు పెమ్మసాని చంద్రశేఖర్‌కు కేంద్ర సహాయ మంత్రి పదవులు ఖరారయ్యాయి.**

**3. దేశంలోని ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థలైన ఐఐటీల్లో ఇంజినీరింగ్ సీట్ల భర్తీకి నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి.**

**4. రామోజీ గ్రూపు సంస్థల ఛైర్మన్ సీహెచ్.రామోజీరావు అంత్యక్రియలు తెలంగాణ ప్రభుత్వ లాంఛనాలతో రామోజీ ఫిల్మ్ సిటీలో ఈ రోజు ఘనంగా నిర్వహించారు.**

**5. ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో ఏపీ లాసెట్, ఏపీ పీజీ లాసెట్- 2024 పరీక్షలు మరికొద్దిసేపట్లో ప్రారంభం కానున్నాయి.**

==========================

ప్రధానమంత్రిగా మూడోసారి బాధ్యతలు స్వీకరించనున్న నరేంద్ర మోదీ ఈ ఉదయం జాతిపిత మహాత్మా గాంధీకి నివాళులర్పించారు. ఢిల్లీలోని రాజ్‌ఘాట్ వద్ద మహాత్మా గాంధీకి ఆయన నివాళులర్పించారు. అనంతరం రాష్ట్రీయ స్మృతి స్థల్ సమీపంలో నిర్మించిన సదైవ్ అటల్‌ను సందర్శించిన నరేంద్ర మోదీ మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయీకి పుష్పాంజలి ఘటించారు. తర్వాత జాతీయ యుద్ధ స్మారకం వద్దకు చేరుకొని అమరవీరులకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు బీజేపీ సీనియర్ నాయకులు రాజ్‌నాథ్ సింగ్, భారత త్రివిధ దళాల అధిపతి.. జనరల్ అనిల్ చౌహాన్, ఆర్మీ చీఫ్ మనోజ్ పాండే, నేవీ అడ్మిరల్ చీఫ్ దినేశ్ త్రిపాఠి పాల్గొన్నారు.

-------------------------

ఈ రోజు రాత్రి 7 గంటల 15 నిమిషాలకు రాష్ట్రపతి భవన్‌లో జరిగే కార్యక్రమంలో ప్రధానమంత్రిగా నరేంద్రమోదీ మూడవసారి ప్రమాణ స్వీకారం చేయనున్నారు. తద్వారా దేశ తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ రికార్డును ఆయన సమం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి దేశంలోని ప్రముఖులతో పాటు వివిధ దేశాల నేతలు కూడా హాజరుకానున్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రమాణ స్వీకారోత్సవానికి శ్రీలంక

అధ్యక్షుడు రణిల్ విక్రమ్‌సింఘే, మాల్దీవుల అధ్యక్షుడు ముయిజ్జు, నేపాల్ ప్రధాని పుష్ప కమల్ దహాల్ ప్రచండ, మారిషస్ ప్రధాని ప్రవింద్ కుమార్, భూటాన్ ప్రధాని తోబ్గేతో సహా పలువురు విదేశీ ప్రముఖులు హాజరుకానున్నారు. ఇప్పటికే బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా, సీషెల్స్ ఉపాధ్యక్షుడు అహ్మద్ అసీఫ్ ఢిల్లీ చేరుకున్నారు. ఈ నేపథ్యంలో దేశ రాజధానిలో పటిష్ట భద్రత కల్పించారు. ఢిల్లీని నో ఫ్లై జోన్‌గా ప్రకటించారు. రాష్ట్రపతి భవన్ లోపల, బయట మూడు అంచెల భద్రతను ఏర్పాటు చేశారు.

---------------------------

కేంద్ర మంత్రివర్గంలో మన రాష్ట్రం నుంచి ఇద్దరు ఎంపీలకు స్థానం ఖరారయింది. శ్రీకాకుళం లోక్‌సభ స్థానం నుంచి వరుసగా మూడోసారి గెలిచిన కింజరాపు రామ్మోహన్‌నాయుడికి క్యాబినెట్ మంత్రి పదవి దక్కనుంది. గుంటూరు ఎంపీగా తొలిసారి గెలిచిన పెమ్మసాని చంద్రశేఖర్‌కు సహాయ మంత్రి పదవి ఇవ్వనున్నారు. ఈ రోజు ప్రధానమంత్రి నరేంద్ర మోదీతోపాటు వీరిరువురు కూడా మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేస్తారు. కాగా.. మంత్రి పదవులు దక్కించుకున్న రామ్మోహన్‌నాయుడు, చంద్రశేఖర్‌కు తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు శుభాకాంక్షలు తెలిపారు.

---------------------------

గుంటూరు లోక్‌సభ నియోజకవర్గం నుంచి తెలుగుదేశం పార్టీ తరపున పెమ్మసాని చంద్రశేఖర్ తొలిసారి పోటీ చేసి ఘన విజయం సాధించారు. విదేశాల్లో వ్యాపారవేత్తగా గుర్తింపు పొందిన ఆయన మాతృభూమికి సేవ చేయాలనే ఆసక్తితో ఎంపీగా పోటీ చేసి రాష్ట్రంలోనే ఆధిక్యతలో రెండవ స్థానంలో నిలిచారు. తాజాగా చంద్రశేఖర్‌కు కేంద్ర మంత్రివర్గంలో సహాయమంత్రిగా అవకాశం లభించింది. దీనికి సంబంధించిన మరిన్ని వివరాలను మా ఆకాశవాణి గుంటూరు ప్రతినిధి రవిశంకర్ అందిస్తారు.

..వాయిస్.. 30 సెకన్లు

---------------------------

దేశంలోని ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థలైన ఐఐటీల్లో ఇంజినీరింగ్ సీట్ల భర్తీకి నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. గత నెల 26న జరిగిన ఈ పరీక్ష ప్రాథమిక కీని ఇటీవల విడుదల చేసిన ఐఐటీ మద్రాస్.. తాజాగా తుది కీ, జేఈఈ అడ్వాన్స్ ఫలితాలను ఈ రోజు ప్రకటించింది. దేశంలోని ఐఐటీలు, ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీలతో పాటు పలు కేంద్ర ప్రభుత్వ ఉన్నత విద్యాసంస్థల్లో సీట్లను భర్తీ చేసేందుకు నిర్వహించిన ఈ పరీక్షను దాదాపు 2 లక్షల మంది రాయగా.. వీరిలో తెలుగు రాష్ట్రాల నుంచి 40 వేల మంది ఉన్నారు. బీటెక్, బ్యాచిలర్ ఆఫ్ సైన్స్, ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సుల్లో సీట్ల భర్తీకి జోసా పేరిట సంయుక్తంగా కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఈ కౌన్సెలింగ్ ప్రక్రియ రేపటి నుంచి జులై 23 వరకు కొనసాగనుంది.

---------------------------

రామోజీ గ్రూపు సంస్థల ఛైర్మన్ సీహెచ్.రామోజీరావు అంత్యక్రియలు తెలంగాణా ప్రభుత్వ లాంఛనాలతో ఘనంగా నిర్వహించారు. అంతకు ముందు రామోజీ ఫిల్మ్‌సిటీలోని నివాసం నుంచి ప్రారంభమైన అంతిమ యాత్ర.. స్మారక కట్టడం వరకు కొనసాగింది. రామోజీరావుకు కడసారి వీడ్కోలు పలికేందుకు వివిధ పార్టీలకు చెందిన నేతలు, రామోజీ గ్రూపు సంస్థల ఉద్యోగులు, ప్రజలు తరలివచ్చారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, తెలంగాణ వ్యవసాయశాఖ

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, విజయవాడ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు వై.సుజనా చౌదరి తదితరులు రామోజీరావు అంతిమయాత్రలో పాల్గొన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో ఉమ్మడి న్యాయ ప్రవేశ పరీక్ష – ఏపీ లాసెట్, ఏపీ పీజీ లాసెట్– 2024 పరీక్షలను ఈరోజు మధ్యాహ్నం 2గంటల 30 నిమిషాల నుంచి 4 గంటల వరకు నిర్వహిస్తారు. దీనికి సంబంధించి అన్ని ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. న్యాయ విద్యకు సంబంధించి మూడేళ్ల ఎల్ఎల్బీ, ఐదేళ్ల ఎల్ఎల్బీ, రెండేళ్ల ఎల్ఎల్ఎం కోర్సుల కోసం ఈ పరీక్షలు నిర్వహిస్తున్నారు. పరీక్ష నిర్వహణ కోసం 105 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులను మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2 గంటల 30 నిమిషాల వరకు అనుమతిస్తారు. నిమిషం నిబంధన అమలు చేయనున్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫైబర్‌నెట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా రాష్ట్ర పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్ నిన్న బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ ఆ బాధ్యతలు నిర్వర్తించిన ఎం.మధుసూదనరెడ్డిని సాధారణ పరిపాలన శాఖలో రిపోర్టు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఫైబర్‌నెట్ ఎండీగా యువరాజ్‌కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్  ఉత్తర్వులు జారీ చేశారు.

---------------------------

వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం దేశవ్యాప్తంగా నిర్వహించిన జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష.. నీట్‌లో 67 మందికి ప్రథమ ర్యాంకు రావడంపై నిరసనలు వ్యక్తమవుతున్న క్రమంలో కేంద్ర విద్యాశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ పరీక్షలో అవకతవకలు జరిగాయంటూ ఆరోపణలు వెల్లువెత్తడంతో యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్.. యూపీఎస్సీ మాజీ ఛైర్మన్ సారథ్యంలో నలుగురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ వారం రోజుల్లో సిఫారసులతో నివేదిక ఇస్తుందని జాతీయ పరీక్షల సంఘం..ఎన్టీఏ డైరెక్టర్ జనరల్ సుబోధ్‌కుమార్ సింగ్ నిన్న తెలిపారు. 15 వందల మందికి పైగా అభ్యర్థులకు ఇచ్చిన గ్రేస్ మార్కుల్ని కమిటీ సమీక్షిస్తుందని.. ఆ తర్వాత వారి ఫలితాలను సవరించే అవకాశం ఉంటుందని వెల్లడించారు.

---------------------------

ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, భారత రైతాంగ ఉద్యమ నిర్మాతల్లో ప్రముఖులు ఎన్.జి.రంగాగా పేరొందిన ఆచార్య గోగినేని రంగ నాయకులు వర్థంతి ఈ రోజు. ఆయన 1900 సంవత్సరం నవంబర్ 7వ తేదీన గుంటూరు జిల్లా నిడుబ్రోలులో జన్మించారు. ఆయన సుదీర్ఘ కాలంపాటు పార్లమెంటు సభ్యుడిగా సేవలందించారు. రైతాంగ విధానాలకు మద్దతిచ్చిన రంగా భారత రైతాంగ ఉద్యమ పితగా గుర్తింపు పొందారు. 1930లో మహాత్మా గాంధీ పిలుపునకు స్పందించి స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు. సుదీర్ఘ కాలం పార్లమెంట్ సభ్యునిగా గిన్నీస్ రికార్డు సృష్టించారు. అనారోగ్యం కారణంగా 95 సంవత్సరాల వయస్సులో 1995 జూన్ 9వ తేదీన నిడుబ్రోలులో రంగా తుదిశ్వాస విడిచారు.

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి

ఎం.వెంకట్రావు కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ......

.....వాయిస్.... 25 సెకన్లు....

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని విశ్వవిద్యాలయాల ఉప కులపతులు అందుబాటులో ఉండాలని రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి జె.శ్యామలరావు ఆదేశాలు జారీచేశారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఎవరూ విశ్వవిద్యాలయ ప్రధాన కార్యాలయాలు విడిచి వెళ్లకూడదని సూచించారు. అన్ని ప్రవేశ పరీక్షలు, అడ్మిషన్లు షెడ్యూలు ప్రకారం జరిగేలా చూడాలని ఆదేశించారు.

=======================